సాక్షి
ప్రకాశం

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025

I



చంద్రబాబు పతనం మొదలైంది

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను చంద్రబాబు బినామీలకు అమ్ముకుంటున్నారని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు.

- IIలో..



కూటమిది దివాలాకోరు

కూటమి ప్రభుత్వం ఏ ఒక్క రైతును ఆదుకోలేదని ఇది దివాలాకోరు ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అన్నారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
31 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

చిరుత పులి దాడిలో గేదె మృతి



గేదె కళేబరం

హనుమంతునిపాడు: చిరుతపులి దాడిలో గేదె మృతిచెందిన ఘటన మండలంలోని హనుమంతాపురం పంచాయతీ నారాయపల్లె గ్రామ సమీపంలో శనివారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన బత్తుల బాలగురవయ్య గేదెలు పొలానికి తోలాడు. ఒక గేదె ఇంటికి తిరిగిరాలేదు. మూడు రోజుల నుంచి గేదె రాకపోవడంతో పొలానికి వెళ్లి వెతుకుతున్నారు. శనివారం గ్రామ సమీపాన అడవిలో చిరుత పులి దాడిలో గేదె మృతిచెంది ఉండటం గుర్తించారు. అక్కడ చిరుత పులి చంపి తిన్నట్లు ఆనవాళ్లు ఉండటంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌లో సాయికి కాంస్య పతకం



కాంస్య పతకం సాధించిన సాయిని అభినందిస్తున్న కరస్పాండెంట్ కోటి సూర్యనారాయణ

ఒంగోలు సిటీ: ఒంగోలులోని పింగళి కోదండ రామయ్య ఓరియంటల్ స్కూల్ విద్యార్థి మర్రిపూడి సాయి 69వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం శనివారం సాధించాడు. రాజమండ్రిలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో అండర్-14 విభాగంలో సాయి ఈ విజయం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నల్లమల్లి కోటి సూర్యనారాయణ సాయికి పతకాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

పరిశ్రమలకు తాళం

"ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేస్తా.. సంపద సృష్టిస్తా" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే తప్ప పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు శూన్యం. కొత్త పరిశ్రమలు రావడం సంగతి దేవుడెరుగు ఉన్న పారిశ్రామికవేత్తలను కూడా కూటమి ప్రభుత్వం నిలువునా మోసగిస్తోంది. జిల్లాలో ఎంఎస్ఎంఈలకు రావాల్సిన రూ.250 కోట్ల రాయితీలకు ఎగనామం పెట్టింది. దీంతో రాయితీలు అందక ..బ్యాంకు రుణాలు భారమై ఇప్పటికే 500 ఫ్యాక్టరీల వరకు మూతపడ్డాయి.

- ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో పరిశ్రమల విలవిల
- 1,200 ఫ్యాక్టరీలకు రూ.250 కోట్ల రాయితీలు ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం
- రాయల్టీ వసూలును ప్రభుత్వం ఏఎంఆర్ సంస్థకు అప్పగించి మరీ భారం
- గుదిబండగా మారిన విద్యుత్ బిల్లులు
- ప్రభుత్వ చర్యలతో 500 ఫ్యాక్టరీల వరకు మూత
- పేర్నమిట్ట, గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్లలో తాళాలు వేసిన పరిశ్రమలు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వ చర్యలతో పారిశ్రామిక రంగం కుదేలవుతోంది. ఎంఎస్ఎంఈలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలకు ఎగనామం పెట్టడం, విద్యుత్ బిల్లులు, రాయల్టీల భారంతో పరిశ్రమలను నడపలేక పారిశ్రామికవేత్తలు ఫ్యాక్టరీలను మూతేసుకుంటున్నారు. జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రావాల్సిన రాయితీలను ఇంత వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఉన్న వాటికి రాయితీలు ఇవ్వకుండా ప్రోత్సాహకాన్ని గాలికి వదిలేసి కొత్తవాళ్లను ప్రోత్సహిస్తాననటంలో పరమార్థం ఏమిటో సీఎం చంద్రబాబుకే తెలియాలి.

రూ.250 కోట్ల రాయితీల ఎగనామం...

జిల్లాలో ఎంఎస్ఎంఈలకు రావాల్సిన రూ.250 కోట్ల రాయితీలకు చంద్రబాబు ప్రభుత్వం ఎగనామం పెట్టింది. జిల్లాలో మొత్తం 1,200 పరిశ్రమలకు రావాల్సిన సబ్సిడీ ఇంత వరకు ఇవ్వకుండా పారిశ్రామికవేత్తలను నిలువునా మోసం చేస్తోంది. అందులో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో 970 పరిశ్రమలకు రూ.170 కోట్ల రాయితీలు రావాల్సి ఉంది. మిగతా ఖాదీ బోర్డు, ఖాదీ కమిషన్‌కు చెందిన పరిశ్రమలున్నాయి. వీటిలో ప్రధానంగా గ్రానైట్ పరిశ్రమలు కాగా ఇతర పరిశ్రమలు కూడా అనేకం ఉన్నాయి.

500 పరిశ్రమల వరకు మూత దిశగా అడుగులు:

జిల్లాలో గ్రానైట్‌తో పాటు అనేక రకాల పరిశ్రమలు మూత దిశగా అడుగులు పడుతున్నాయి. పారిశ్రామికంగా ఎంఎస్ఎంఈలను ప్రభుత్వం ప్రోత్సహించకపోవటంతో పాటు హక్కుగా రావాల్సిన సబ్సిడీలు కూడా ఇవ్వకుండా వేధించటమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా గ్రానైట్ పరిశ్రమ కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. అలాంటి గ్రానైట్ పరిశ్రమ పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైంది. ఇప్పటికే 400లకు పైగా గ్రానైట్ పరిశ్రమలు మూత పడగా, మరో 50 నుంచి 60 వరకు మూత దిశగా అడుగులు పడుతున్నాయి. మూత పడే దిశలో మరికొన్ని రకాల ఫ్యాక్టరీలు ఉన్నాయి. చీమకుర్తి మండలంతో పాటు సంతనూతలపాడు, పేర్నమిట్ట, మద్దిపాడు మండల గుళ్లాపల్లి గ్రోత్ సెంటర్లలో మూతపడిన ఫ్యాక్టరీలకు కొన్నింటికి తాళాలు వేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్టూరు, బల్లికురవ మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. నష్టాలపాలై పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నారు. రాయితీ వస్తుందని బ్యాంకుల్లో రూ.కోట్లలో రుణాలు తీసుకొని ఫ్యాక్టరీలు స్థాపిస్తే ప్రభుత్వ ప్రోత్సాహం లేక, రాయితీలు విడుదల చేయకపోవటంతో పారిశ్రామికవేత్తలు అప్పుల్లో కూరుకుపోయారు.

రాయల్టీ వసూలు ఏఎంఆర్ సంస్థకు అప్పగించి మరీ భారం:

రాష్ట్ర ప్రభుత్వం అసలే కష్టకాలంలో ఉన్న గ్రానైట్ పరిశ్రమపై మరో భారం మోపింది. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా మైనింగ్ రాయల్టీ వసూళ్లు ప్రైవేట్ ఏఎంఆర్ సంస్థకు లీజుకు ఇచ్చింది. దాంతో గ్రానైట్ పరిశ్రమల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. గతంలో బ్లేడుకు రూ.27 వేలు చార్జీ ఉంటే దానిని రూ.35 వేలకు పెంచింది ఏఎంఆర్ సంస్థ. లీజు పొందిన సంస్థ అదనంగా వసూళ్లకు పూనుకుంటున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ యజమానులు అక్టోబర్ 1 నుంచి సమ్మెలోకి వెళ్లి ఫ్యాక్టరీలు బంద్ చేశారు. కార్మికులు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వ భారాలతో పాటు ముడిరాయి కొనుగోలు ఖర్చులు పెరిగాయి. ఫినిష్ చేసిన స్లాబుల ఎగుమతి లేక, అంతర్గత మార్కెట్ లేక జిల్లాలో చాలా పరిశ్రమలు మూతపడ్డాయి. కొన్ని 3 షిఫ్టులు కాకుండా ఒక్క షిఫ్టు మాత్రమే నడుపుతూ నెట్టుకొస్తున్నాయి. చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం ఇచ్చి ఆదుకోవాల్సింది పోయి ఈ విధంగా భారం మోపడం వల్ల, పెద్ద పరిశ్రమల పోటీకి తట్టుకోలేక మూతవేసుకోవాల్సిన స్థితిలో యజమానులు సతమతమవుతున్నారు.

త్వరలో రాయితీలు విడుదలవుతాయి



జిల్లాలో ఎంఎస్ఎంఈలకు రావాల్సిన రాయితీలను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు రాయితీలు విడుదల చేయటానికి సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసినట్లు సమాచారం. వచ్చే నెలలో విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ పారిశ్రామిక సమ్మిట్ జరగనుంది. ఈ లోగా అందరికీ రాయితీలు వస్తాయన్న ఆశాభావంతో ఉన్నాం.

– బి.శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం

ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది



గ్రానైట్ ఫ్యాక్టరీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. సకాలంలో రాయితీలు ఇచ్చిన ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వేత్తలను ఆదుకోవటం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి 17 నెలలు పూర్తి కావస్తోంది. అయినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రాయితీలు విడుదల చేయలేదు. దానికి తోడు ప్రభుత్వం వసూలు చేయల్సిన రాయల్టీని ప్రైవేటు ఏఎంఆర్ సంస్థకు అప్పగించింది.

– కాలం సుబ్బారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

మూతపడినా భారంగా మారిన విద్యుత్ బిల్లులు



మూతబడిన గ్రానైట్ ఫ్యాక్టరీ

పేర్నమిట్ట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో డైనమిక్ గ్రానైట్ మూతపడింది. నాగేశ్వరరావు అనే పారిశ్రామికవేత్త పార్కు ఏర్పడిన తొలినాళ్లలో ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వ ప్రోత్సాహం కరువై ఫ్యాక్టరీని నడపలేక మూతేశారు. ఎవరికైనా అద్దెకు గోడాన్ల కోసం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. అయితే ఫ్యాక్టరీ మూసేసినా విద్యుత్ బిల్లు భారంగా మారింది. ప్రస్తుతం ఫ్యాక్టరీ నడవటం లేదు. అక్కడ వాచ్‌మెన్ ఉంటాడు. మూడు లైట్లు మాత్రమే వేస్తున్నారు. అయినా నెలకు రూ.20 వేలు విద్యుత్ బిల్లు వస్తోంది. మూడు, నాలుగు సంవత్సరాల క్రితం వాడుకున్న యూనిట్లకు గాను ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లు బాదుడు బాదుతున్నారు. దాంతో ఫ్యాక్టరీ మూసేసినా విద్యుత్ బిల్లు భారం మోయలేకున్నారు.

సాక్షిపై అక్రమ కేసులు ఎత్తివేయాలి



కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కనిగిరి రూరల్: సాక్షి ఎడిటర్, బ్యూరోలు, జర్నలిస్టుల మీద పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ శనివారం కనిగిరి ఆర్డీఓ వి.కేశవర్ధన్‌రెడ్డికి జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ పత్రికల్లో ఏవైనా వార్తలు తప్పుగా వస్తే ఖండన ఇవ్వవచ్చన్నారు. ప్రభుత్వం బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తూ ఎడిటర్లు, బ్యూరోలు, విలేకర్లపై అక్రమ కేసులు బనాయించి సోదాలు చేయించడం సరికాదన్నారు. అక్రమ కేసులను ఎత్తివేసి పత్రికా స్వేచ్ఛను కాపాడాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు కొండ్రు ప్రసాద్, సీహెచ్.సురేష్‌రెడ్డి, వివిధ పత్రికల ప్రతినిధులు, జర్నలిస్టులు పందిటి మోహన్, తాతపూడి శ్యామ్, కొట్టికర్ల బాదుల్లా, ఎస్‌కే.బాషా, పలువురు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించటమే



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు, నాయకులు


కురిచేడు: నకిలీ మద్యం తయారీని, విక్రయాలను బయటపెట్టారనే కక్షతో సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ్ రెడ్డితో పాటుగా సాక్షి బ్యూరో ఇన్‌చార్జులు, విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం పత్రికా స్వేచ్ఛను హరించటమేనని పలు సంఘాల నాయకులు అన్నారు. జర్నలిస్టులపై అక్రమ కేసులకు నిరసనగా కురిచేడులోని జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని సాక్షి కార్యాలయాల పై జరుగుతున్న దాడులు అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో వివిధ పత్రికల పాత్రికేయులు, జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛపై కాలకూటమి

ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని నిలదీస్తున్న 'సాక్షి'పై చంద్రబాబు ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. సాక్షి ఎడిటర్ ఆర్.ధనుంజయ్‌రెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేసి విచారణల పేరుతో వేధిస్తోంది. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తోంది. రాష్ట్రంలో పరిస్థితులు ఎమర్జెన్సీ నాటి దురాగతాలను తలపిస్తున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన ప్రతిసారీ ఎక్కడో ఒక చోట సంబంధం లేని వ్యక్తులతో ఫిర్యాదుల చేయించి పోలీసులను ఉసిగొల్పుతోంది. పత్రికల గొంతు నొక్కి ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయాలని కూటమి సర్కారు చేస్తున్న కుట్రలపై ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. జర్నలిస్టులను అక్రమ కేసులతో వేధించడాన్ని ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

- సాక్షి నెట్‌వర్క్

భావ ప్రకటన స్వేచ్ఛకు తూట్లు పొడుస్తున్నారు



రాష్ట్రంలో ప్రభుత్వం, పోలీసులు భావ ప్రకటనా స్వేచ్ఛకు తూట్లు పొడుస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు వెలుగులోకి తెస్తుంటే సహించలేక పోలీసులను పావుగా వాడుతూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. నకిలీ మద్యం పై కథనాలు, కరేడు భూముల వ్యవహారం పై కథనాలు రాస్తూ ప్రజల పక్షాన నిలిచిన సాక్షి పత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు నమోదు చేయటంతో పాటు నోటీసులు ఇచ్చి కార్యాలయానికి వెళ్లి ప్రశ్నించటం ఇది ముమ్మాటికీ పత్రికాస్వేచ్ఛపై దాడి.

– కే నాంచార్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం, సింగరాయకొండ

ఎమర్జెన్సీని తలపిస్తోంది



పత్రికా స్వేచ్ఛకు పచ్చ పోలీసు సంకెళ్లు తగవు. రాజ్యాంగం భావ ప్రకటనకు స్వేచ్ఛనిచ్చింది. సాక్షి ఎడిటర్, నెల్లూరు బ్యూరో ఇన్ చార్జిలపై పోలీసుల అత్యుత్సాహంతో కేసులు నమోదు చేసినట్లు అర్థమవుతోంది. అధికారంలో ఉన్నవారు చెప్పినట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారు. ప్రజల పక్షాన వాదన వినిపించే విలేకరులపై కేసులు పెట్టడం ఎమర్జెన్సీని తలపిస్తోంది. ఎమర్జెన్సీ రోజుల్లో ప్రతి ఒక్కటీ సెన్సార్ అయ్యేది. విలేకరులను కేసుల్లో ఇరికించడం ఏ ప్రభుత్వానికి మంచిది కాదు.

– నీలం నాగేంద్రరావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు

పత్రికల మీద కేసులు రాజ్యాంగ విరుద్ధం



ప్రజాస్వామ్యానికి పత్రికలు నాలుగో స్తంభం లాంటివి. ప్రజాస్వామ్యం ప్రకారం తమ భావజాలాన్ని వ్యక్తం చేసే హక్కులు రాజ్యాంగం కల్పించింది. కేవలం కొంత మందిని లక్ష్యం చేసుకుని కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారు. సాక్షాత్తు చీఫ్ ఎడిటర్ మీద కేసులు పెట్టడం నోటీసులు ఇచ్చే సాకుతో ఇంటి వద్దకు వెళ్లి హంగామా సృష్టించడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. జర్నలిస్టులపై దాడులు పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడమే. ఇప్పటికైనా ప్రభుత్వం తన తీరును మార్చుకొని పత్రికలపై ఆంక్షలు పెట్టకుండా ఉండాలి. పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేకపోతే ఆ వార్తపై సంబంధిత వ్యక్తులు, సంస్థలు, అధికారులు ఖండన ఇవ్వచ్చు. అంతేగానీ సోదాల పేరుతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదు.

– కేజీ మస్తాన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, కొండపి



పాత్రికేయులపై వేధింపులు నిలిపేయాలి



రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న పలు వ్యవహారాలపై పాత్రికేయులు కథనాలు ప్రచురించడం వృత్తి ధర్మం. ప్రస్తుతం రాష్ట్రంలో విలేకరులపై జరుగుతున్న దాడులు దారుణం. జర్నలిస్టుల వృత్తి ధర్మంలో భాగంగానే నకిలీ మద్యం వ్యవహారంపై కథనాలు రాసి ఉండొచ్చు. దీన్ని ప్రభుత్వం చాలెంజ్‌గా తీసుకుని జరిగిన తప్పులపై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. వార్తలు రాసే జర్నలిస్టులపై కేసులు పెట్టడం సరికాదు.

– గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ మార్కాపురం డివిజన్ నాయకులు

సాక్షిపై కేసులు ఎత్తివేయాలి



రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వం కాపాడాలి. పబ్లిష్ అయిన వార్తలపై పోలీసుల ద్వారా అక్రమ కేసులు పెట్టడం మంచి సాంప్రదాయం కాదు. ఇటీవల కాలంలో సాక్షి ఎడిటర్‌తోపాటు కొంతమంది పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి. అధికారంలో ఉన్నవారికి పత్రికల్లో వచ్చిన వార్తలు నచ్చకపోతే ఖండన ఇవ్వొచ్చుకానీ, పోలీసులతో కేసులు పెట్టించకూడదు.

– ఓవి మల్లిక్, సీనియర్ జర్నలిస్టు, మార్కాపురం

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు సరికాదు



పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమంటే ప్రజాస్వామ్య స్ఫూర్తికే ప్రమాదకరం. ఇటువంటి చర్యలను ప్రజలు హర్షించరు. ప్రభుత్వ విధానాల్లో తప్పులను చూపెడుతూ వార్తలు రాస్తే సరిదిద్దుకుని ప్రజాస్వామ్య ప్రభుత్వంగా పనిచేయాలే తప్ప ఇలా కక్ష కట్టి వార్తలు రాసిన యాజమాన్యాలపై, జర్నలిస్టులపై కేసులు పెట్టి సంకెళ్లు వేస్తే ఏదో ఒక రోజు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. మీడియాపై కేసులు పెట్టి భయపెట్టాలని చూడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. మీడియా స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

– వేశపోగు సుదర్శన్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పెద్దారవీడు

పాత్రికేయులపై కేసులు తగదు



వాస్తవాలు ప్రచురించిన సాక్షి దినపత్రిక ఎడిటర్, బ్యూరోలను పోలీసులు పదే పదే నోటీసుల పేరుతో వేధించడం మంచి పద్ధతి కాదు. పత్రికల్లో వార్తలు రాస్తున్నారని పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం వారి నైతిక ధైర్యాన్ని హరించడమే అవుతుంది. ఇది అప్రజాస్వామిక చర్యే.

– మహమ్మద్ ఇబ్రహీం, యస్.జి.పి.ఎ కంభం ఏరియా అధ్యక్షుడు

వెలుగొండ నిర్వాసితుల నుంచి

అక్రమ వసూళ్లు



వెలుగొండ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేసేందుకు రూ.10 కోట్ల వసూళ్లకు తెరలేపిన టీడీపీ నేతలు
- వెలుగొండపై చిత్తశుద్ధిలేని కూటమి ప్రభుత్వం
- అక్రమ వసూళ్లు ఆపకపోతే వేలాదిమందితో ధర్నా చేస్తా
- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేసేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.20 వేలను టీడీపీ నేతలు వసూలు చేస్తున్నారని, ఈ అక్రమ దందాను ఆపకపోతే వేలాది మందితో ధర్నా చేస్తానని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరించారు. మార్కాపురం మండలం రాయవరం సమీపంలో ఉన్న వెలుగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టరును శనివారం ఆయన కలిసి మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2005 నుంచి గెజిట్‌లో పేరున్నా అవార్డుకాని వారి సంఖ్య దాదాపు 1350 మంది ఉన్నారన్నారు. గెజిట్‌లో పేర్లు ఉన్న వారికి అవార్డు ఇచ్చేందుకు మీకున్న సమస్య ఏమిటన్నారు. అధికారులు 2005 నాటి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులు తెమ్మంటూ నిర్వాసితులను ఇబ్బంది పడుతున్నారని, అవి లేనివారి పరిస్థితి ఏమిటని అన్నారు. అన్నీ కార్డులు ఉన్నా సుమారు 900 మందికి అవార్డు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రాజెక్టు నిర్వాసితులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని ఎమ్మెల్యే చంద్రశేఖర్ చెప్పారు. ఒక్క కొత్తపేరు కూడా అవార్డుకు ఎంపిక కాలేదని, ఇచ్చిన అరకొర నిధులు కూడా టీడీపీకి చెందిన వారికే విడుదల చేయించుకోవడం తప్ప ఆయా గ్రామాల్లో నివశిస్తున్న అర్హులైన వారికి ఒక్కరికి కూడా సహాయం చేసే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేనట్టుందన్నారు. సుమారు 5 వేల మంది నిర్వాసితులు ఉన్నారని, వారందరికీ ఒకేసారి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా కొంతమందికే ఇచ్చి 1300 మంది నిర్వాసితులను వదిలేస్తే వారికి ఎప్పుడు అవార్డు ఇస్తారని అన్నారు. ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఓటరు కార్డులను తీసుకొచ్చి వివరాలను అధికారులకు చెప్పానని అన్నారు. ఒక నెలలోనే ఈ ప్రక్రియ పూర్తిచేస్తానని స్పెషల్ డిప్యూటీ కలెక్టరు చెప్పారని అన్నారు.

పైసలిస్తేనే పరిహారం

కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 18 నెలలు కావస్తున్నా ఇంత వరకూ వెలుగొండను ఎందుకు పూర్తిచేయలేదని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే పూర్తి చేయలేరా అని ఎమ్మెల్యే చంద్రశేఖర్ అన్నారు. రాజకీయ కక్షలతో నిర్వాసితులను ఇబ్బందిపెట్టడం తగదన్నారు. టీడీపీ నాయకులు ప్రతి వ్యక్తి వద్ద నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పేర్లు చెప్పి రూ.20 వేలు డబ్బులు ఇస్తేనే పేర్లు పొందుపరుస్తామని, డబ్బులివ్వకుంటే అవార్డులో పేరున్నా మీకు డబ్బులు రావంటూ బెదిరిస్తున్నారని అన్నారు. 7 వేల మంది వరకూ నిర్వాసితులు ఉన్నారని, ఒక్క యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచే 5 వేల మంది ఉన్నారని, దాదాపు రూ.10 కోట్లను టీడీపీ నాయకులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటివన్నీ ఇక్కడున్న ఇన్‌చార్జికి పట్టవని ఎమ్మెల్యే చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్షన్‌లలో బిజీగా ఉంటారే తప్ప ప్రజల కోసం పనిచేసే ఆలోచనే చేయడన్నారు. వెలుగొండ ప్రాజెక్టులో జరుగుతున్న అక్రమాలపై పదే పదే చెబుతున్నా ఈ పెద్దమనిషి నోరు విప్పడన్నారు. ఎందుకంటే వచ్చే కమీషన్ పోతుందేమోనని అన్నారు. ఆయన వెంట పెద్దారవీడు మండల పార్టీ కన్వీనర్ పీ కృష్ణారెడ్డి, సుంకేసుల సర్పంచ్ రమేష్, నాగిరెడ్డి, పుల్లారెడ్డి, సహదేవుడు, రమణారెడ్డి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి

ఒంగోలు సబర్బన్: వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులను టీడీపీ నాయకులు దోచుకుంటున్నారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కలెక్టర్ పీ రాజాబాబు దృష్టికి తెచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అనంతరం కలెక్టర్‌తో ఎమ్మెల్యే తాటిపర్తి యర్రగొండపాలెం నియోజకవర్గంలో జరుగుతున్న టీడీపీ అరాచకాలు, అక్రమాలు, అవినీతి గురించి వివరించారు. కలెక్టరేట్‌లో తాటిపర్తి చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడారు. యర్రగొండపాలెంలో టీడీపీ ఇన్‌చార్జ్ చేస్తున్న అవినీతిని, అక్రమాలను, దౌర్జన్యాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నియోజకవర్గంలో కుంటుపడుతున్న అభివృద్ధి గురించి కూడా వివరించానన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులను టీడీపీ యర్రగొండపాలెం ఇన్‌చార్జ్ దోచుకుంటున్నాడన్నారు. నిర్వాసితుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. డబ్బులు ఇస్తేనే నిర్వాసితుల పేర్లు నమోదు చేసి నిధులు మంజూరు చేయిస్తున్నాడని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 1,300 మందికి ఆర్‌ఆర్ ప్యాకేజీ మంజూరు కాలేదని, కనీసం అవార్డు కూడా కాకుండా టీడీపీ ఇన్‌చార్జ్ అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

కనిగిరిరూరల్: కర్ణాటకలోని దావనగిరిలో ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగే 31వ దక్షిణ భారత ఖోఖో పోటీలకు కనిగిరికి చెందిన ఏడు గురు ఎంపికైనట్లు ఖోఖో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కరరావు, బి.కాశీవిశ్వనాథ రెడ్డి తెలిపారు. కనిగిరికి చెందిన యు నాగమల్లేశ్వరి, ఎం సఫియా, యు శశికళ, ఎస్ పావని, ఆర్ యశోద , బి గుణవతి, అమృత ఎంపికయ్యారు. వీరంతా నాలుగు రోజులుగా కృష్ణా జిల్లా గన్నవరంలో జరుగుతున్న శిక్షణలో పాల్గొంటున్నారు. క్రీడాకారులను ఎంఎస్ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరు సుబ్బారావు, ఎంఎస్ఆర్ కళాశాల అడ్వయిజర్ పి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఎం సీతారామిరెడ్డి, కోశాధికారి కె.హనుమంతరావు అభినందించారు.

అండర్-19 ఖోఖో బాలికల జట్టు ఎంపిక

కనిగిరిరూరల్: విజయనగరం జిల్లాలో జరిగే అండర్-19 స్కూల్ గేమ్స్ ఖోఖో బాలికల జట్టును శనివారం వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎం చింపారెడ్డి, సింగరాయకొండ జూనియర్ కాలేజీ పీడీ కె.శంకర్ పాల్గొని జిల్లా జట్టును ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఎస్‌కే గౌసియా బేగం, పీడీ బి.కాశీవిశ్వనాథరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపికైన బాలికల జట్టు..

టి.సుజన, ఏ పురందేశ్వరి, యు రేఖ, స్రవంతి, బి.కల్యాణి, మి.గౌనవతి, పి.అమృత, ఎం నాగేశ్వరి, ఎం ప్రియాంక, ఎం యశశ్వరి, మేఘ, ఎన్‌వీఎస్ అశ్రీజ, కె.వైష్ణవి, బి.శృతి, ఎస్ భానుప్రియ ఎంపికయ్యారు.

చంద్రబాబు పతనం మొదలైంది

- బినామీలకు అమ్ముకునేందుకే పీపీపీ పేరుతో 17 మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం
- పేద పిల్లల భవిష్యత్తును నాశనం చేయడాన్ని ఎండగడదాం
- కూటమి కుట్రలను కోటి సంతకాలతో భగ్నం చేద్దాం
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిలిచిపోయేంత వరకూ పోరాడుదాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి పిలుపు
- చీమకుర్తిలోని గరికమిట్టలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

చీమకుర్తి:

లూలూ, ఉర్సా కంపెనీలకు కోట్లాది రూపాయల విలువ చేసే వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను చంద్రబాబు కట్టబెడుతున్నారని, పేద విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెట్టేలా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తన బినామీలకు పీపీపీ పద్ధతి ద్వారా అమ్ముకుంటున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశ్రీ పథకానికి తూట్లు పొడిచారని, 108, 104ను గాలికొదిలేశారని, రాష్ట్రంలో పరిపాలనను పూర్తిగా అవినీతి మయం చేశారని దుయ్యబట్టారు. ఇవన్నీ చూస్తూ వైఎస్సార్ సీపీ ఊరుకోదని, చంద్రబాబు పతనం ఇప్పుడే మొదలైందని బూచేపల్లి శివప్రసాదరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి వ్యతిరేకంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శనివారం చీమకుర్తిలోని గరికమిట్టలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహించేంత వరకూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటం ఆగదని హెచ్చరించారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ఎండగట్టేందుకు ప్రజలంతా సమాయత్తం అవుతున్నారన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటుపరం కాకుండా జిల్లా స్థాయిలో ఈ నెల 28వ తేదీ నిర్వహించనున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.



కోటి సంతకాల సేకరణకు చీమకుర్తి రచ్చబండ వద్దకు వస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు

17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తెచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ : మేరుగు నాగార్జున

వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ దేశంలోనే ఒకేసారి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు తెచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని అన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తును తుంగలో తొక్కే విధంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసేందుకు చంద్రబాబు చేస్తున్న కుట్రను కోటి సంతకాలతో భగ్నం చేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరొస్తుందనే అక్కసుతోనే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను చంద్రబాబు తన బినామీలకు అమ్ముకుని పేద విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాడన్నారు. లిక్కర్ కుంభకోణం పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. చివరకు మీడియా ప్రతినిధులను సైతం వదలకుండా చంద్రబాబు కుమారుడు లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నాడని మేరుగు నాగార్జున మండిపడ్డారు.

చంద్రబాబు నిరంకుశ పాలనపై ప్రజల మండిపాటు బూచేపల్లి వెంకాయమ్మ, బత్తుల బ్రహ్మానందరెడ్డి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు సాగిస్తున్న నిరంకుశ పాలనపై ప్రజలు మండిపడుతున్నారన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం కాకుండా వైఎస్సార్ సీపీ చేస్తున్న పోరాటంలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి చీమకుర్తిలో సంతకాలు చేసి పోరాటానికి శ్రీకారం చుట్టారు. గరికమిట్టలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గరికమిట్టలోని రామాలయంలో పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బొట్ల రామారావు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, స్థానిక కౌన్సిలర్లు గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి, బీమన వెంకట్రావు, ఎన్.మాణిక్యం, పాటిబండ్ల గంగయ్య, సోమా శేషాద్రి, తప్పెట బాబూరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోగినేని వెంకటేశ్వర్లు, నాయకులు మేకల యల్లయ్య, ఏ రామబ్రహ్మం, గోపురపు చంద్ర, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, తెల్లమేకల గాంధీ, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తూ...

కూటమిది దివాలాకోరు ప్రభుత్వం

- రైతాంగాన్ని ఆదుకోలేని చేతగాని ప్రభుత్వం
- హామీల అమలులో ఘోరంగా విఫలం
- గిట్టుబాటు ధర లేక రెండేళ్లుగా కోల్డ్ స్టోరేజీల్లో మగ్గుతున్న శనగలు
- నష్టపోయిన రైతులు
- శనగలకు రూ.3 వేలు బోనస్ ప్రకటించాలి
- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు, పాల్గొన్న నాయకులు

ఒంగోలు సిటీ: ఈ ఏడాది మాగాణి రైతు మొదలుకుని శనగ, మిర్చి, పొగాకు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక తీవ్రంగా నష్టపోయారని, కూటమి ప్రభుత్వం 18 నెలలుగా ఏ ఒక్క రైతునీ ఆదుకోలేదని, ఇది దివాలాకోరు ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు ధ్వజమెత్తారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు సీజన్లకు చెందిన శనగ పంటకు గిట్టుబాటు ధర లభించక కోల్డ్ స్టోరేజీల్లో మగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇదే పరిస్థితి ఎదురైతే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే క్వింటాకు రూ.1500 చొప్పున బోనస్ ఇచ్చి ఒక్కో రైతు నుంచి గరిష్టంగా 30 క్వింటాల చొప్పున తెల్ల శనగలను క్వింటా రూ.12 వేలకు, ఎర్రశనగలను క్వింటా రూ.10 వేలకు కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ క్రాప్ నమోదు, పంటల బీమా అమలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించి ఆదుకున్నారని వివరించారు. తద్వారా ఐదేళ్ల పాటు అన్ని వర్గాల రైతులు లబ్ధిపొందినట్లు వివరించారు. కానీ, కూటమి ప్రభుత్వం రైతులన్నా, పంటలకు గిట్టుబాటు ధరలన్నా చులకనగా చూస్తోందని విమర్శించారు. రైతుల గురించిగానీ, పంటల గురించిగానీ కూటమి ప్రభుత్వానికి, పాలకులకు పట్టడం లేదని ధ్వజమెత్తారు.

దయనీయంగా పొగాకు రైతు పరిస్థితి...

ఈ ఏడాది పొగాకు రైతు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని చుండూరి రవిబాబు అన్నారు. ప్రతి రైతుకు బ్యారన్‌కు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల బ్యారన్ల ద్వారా రూ.2200 కోట్లు విదేశీ మారక ద్రవ్యం సమకూరుస్తున్న పొగాకు రైతును కూటమి ప్రభుత్వం చులకనగా చూస్తోందని దుయ్యబట్టారు. గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం చెందినట్లు ఆరోపించారు. బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియలో కూటమి అనుయాయులకు చెందినవి కొనుగోలు చేయడం వివక్షపూరిత చర్యగా ఆరోపించారు. గత ప్రభుత్వం పార్టీలకు అతీతంగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినప్పుడు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అటువంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వ్యవసాయం వృథా అని భావించే కూటమి పాలకులు.. ఏ పంట సాగుచేయాలో, ఏ పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి శనగలకు క్వింటాకు రూ.3 వేలు బోనస్ ప్రకటించి తెల్ల శనగలు రూ.10 వేలకు, ఎర్రశనగలు రూ.8 వేలకు కొనుగోలు చేయాలని చుండూరి రవిబాబు డిమాండ్ చేశారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించి పంటలు కొనుగోలు చేస్తే వ్యవసాయం అభివృద్ధి చెంది తద్వారా సంపద పోగవుతుందని తెలిపారు. రైతుకు నష్టం చేకూరిస్తే సంపద ఆవిరవుతుందని గుర్తించాలని హితవు పలికారు. రైతుకు న్యాయం జరిగేంత వరకు తమ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రరెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, ఒంగోలు మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, నాయకులు దామరాజు క్రాంతికుమార్, నాసర్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, డి.కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు సిటీ: దీపావళి పండుగ సందర్భంగా అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా ఎవరైనా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు. బాణసంచా విక్రయదారుల చట్ట ప్రకారం నిర్దేశించిన నిబంధనలు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా తల్లిదండ్రులు పర్యవేక్షణలో ఉండాలన్నారు. జిల్లాలో అనుమతి లేకుండా టపాసులు తయారు చేయడం, అక్రమంగా రవాణా చేయడం, విక్రయించడం వంటి చర్యలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. బాణసంచా తయారీ, విక్రయాలు నిర్వహించే వారు లైసెన్సు కలిగి ఉండి ప్రభుత్వం సూచించిన నియమ, నిబంధనలకు కట్టుబడి ఉండాలన్నారు. బాణసంచా లేదా పేలుడు పదార్థాలను ఇళ్లలో నిల్వ ఉంచరాదని, శాశ్వత లేదా తాత్కాలిక లైసెన్సు పొందిన దుకాణాల్లో మాత్రమే విక్రయాలు జరగాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత ప్రమాణాల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకుని మాత్రమే విక్రయాలు నిర్వహించాలన్నారు. షాపుల వద్ద మండే స్వభావం ఉన్న వస్తువులు ఉంచరాదని, డ్రమ్ములలో నీరు, ఇసుక, ఇతర అగ్నిమాపక సామగ్రి తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా బాణసంచా విక్రయ కేంద్రాలు నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. కనిగిరి-1, మద్దిపాడు-1, పామూరు-2, వెలిగండ్ల-1, మార్కాపురం టౌన్-1 పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేసి రూ.1,38,944 విలువ గల బాణసంచా సీజ్ చేసినట్లు చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్:

వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. రోజువారీ కార్యక్రమాల్లో ఈ దిశగా దృష్టి సారించాలని సూచించారు. ' స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ' కార్యక్రమంలో భాగంగా శనివారం 'క్లీన్ ఎయిర్' ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ప్రకాశం భవనంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని నివారించేందుకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరించాలని సూచించారు.

కార్యాలయాలకు, ఇతర అవసరాల కోసం బయటకు వెళ్లేవారు దగ్గరలో అయితే నడుచుకుంటూ లేదా సైకిల్ తొక్కుకుంటూ వెళ్లాలని పిలుపునిచ్చారు. దూరమైతే వ్యక్తిగత వాహనాలు కాకుండా ప్రజారవాణా వ్యవస్థను వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా పర్యావరణంలో వాయు కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాల్లో భాగస్వాములు కావాలన్నారు. విరివిగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు కలెక్టరేట్లో మొక్కలు నాటారు. వాయు కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకునేలా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, డీఈఓ కిరణ్‌కుమార్, సీపీఓ సుధాకర్‌రెడ్డి, ఎక్సైజ్ అధికారి ఆయేషా బేగం, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పద్మ, కలెక్టరేట్ పరిపాలన అధికారి రవికుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో మొక్కలు నాటుతున్న కలెక్టర్ రాజాబాబు

డీటీసీని పరిశీలించిన ఎస్పీ

ఒంగోలు సిటీ: స్థానిక కొత్తమామిడిపాలెంలోని పోలీస్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం పరిశీలించారు. 208 మంది పోలీసు కానిస్టేబుళ్లకు త్వరలో శిక్షణ తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో డీటీసీని ఎస్పీ సందర్శించారు. పరిసర ప్రాంతాలు, మౌలిక సదుపాయాలు, బ్యారక్‌లు, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. వంట గదిలో అపరిశుభ్రతను గుర్తించి వెంటనే మార్పులు చేయాలన్నారు. డైనింగ్ హాళ్లలో తలుపులు, పెయింటింగ్‌తో పాటు పైకప్పు నుంచి కారుతున్న వర్షం నీటిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్‌కు ఉపయోగపడేలా గ్రౌండ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మైదానం చదునుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియా, గార్డెన్ వంటి సదుపాయాలు, అదనపు మౌలిక వసతుల ఏర్పాటు, శుభ్రతపై నిరంతర దృష్టి అవసరమని అధికారులకు సూచించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి నిపుణుల ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. మొక్కలు నాటి ట్రైనింగ్ సెంటర్ పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, డీపీఓ రామ్మోహన్‌రావు, పోలీస్ క్లినిక్ డాక్టర్ భానుమతి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, తాలూకా సీఐ విజయకృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఆర్‌ఐలు సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



డీటీసీని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

పాకల బీచ్‌ను అభివృద్ధి చేస్తాం

- కలెక్టర్ రాజాబాబు

సింగరాయకొండ: పర్యాటక రంగ అభివృద్ధికి అవకాశం ఉన్న పాకల బీచ్‌ను అన్ని రకాలా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. పాకల బీచ్‌ను శనివారం మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ బీచ్‌కు వచ్చే పర్యాటకులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు, దుస్తులు మార్చుకోడానికి వీలుగా సౌకర్యాలు కల్పించాలన్నారు. బీచ్‌లో మొక్కలను నాటారు. అంతకుముందు మండల కేంద్రంలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి స్వామి, డీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొని ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. విద్యార్థులు సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేసి సత్కరించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఆర్డీఓ కళావతి, తహసీల్దార్ రాజేష్, ఈఓ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు